# బంగారు బొమ్మ రావేమే



నేను మా ఫాక్టరీ మొదలుపెట్టే రోజుల్లో తరచు ఢిల్లీలో రావుగారి ఆఫీసుకి వెళ్తుండే దాన్ని. ఆయన ఆ కార్పొరేషనుకి మానేజింగ్ డైరెక్టరు, లక్షణంగా చేస్తున్న వుద్యోగం మానేసి ఇండస్ట్రీ పెడతానంటూ వాళ్ళ చుట్టూ తిరిగే నన్ను వాళ్ళ ఆఫీసువాళ్ళంతా కొంత ఆశ్చర్యంతోనూ, మరికొంత జాలిగానూ చూస్తూ వుండేవారు.

ఒకసారి ఆయన "మీరిన్నిసార్లు వచ్చినా మా ఆవిడని కలవలేదు. ఈవేళ మా ఇంటికి రండి" అంటూ అక్కడికి నడకదూరంలో వున్న వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళారు. ఆవిడ ఏదో పెద్ద స్కూల్లో ఇంగ్లీషు టీచరుగా పని చేసేవారు. వాళ్ళ ఇద్దరమ్మాయిలు కూడా ఆ స్కూల్లోనే చదివేవారు. మేం వాళ్ళ ఇంటికి చేరేసరికి, తల్లీ పిల్లలు అప్పుడే స్కూలు నుంచి వచ్చారు. మేము చూసుకున్న వేళా విశేషమో ఏమో నేను ఎప్పుడూ మళ్ళీ ఢిల్లీలో ఏ హెూటల్‌లోనూ దిగలేదు. అప్పుడే నాచేత హెూటల్‌గది ఖాళీ చేయించి వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళిపోయారు. అలా మొదలైన మా స్నేహం ఈ నలభైమూడేళ్ళలో చిన్నమెత్తు మారలేదు. ఒకరి అవసరాలకు ఇంకొకరు స్పందిస్తూ ఒకే కుటుంబంగా కలిసిపోయాం. నాకు ఇంచుమించు ఆ ఇంటి ఆడబడుచు హెూదా దక్కింది. రావుగారికి స్వంత అక్కచెల్లెళ్ళు లేరు. మేము మా జీవనయానంలో సంపాదించుకున్న మిత్రబృందంలో అతి ముఖ్యులు, సన్నిహితులు డా॥ రావికంటి అచ్యుతరావు, కల్యాణి దంపతులు.

కాల ప్రవాహంలో స్నేహం పెరిగినట్లే పిల్లలూ పెరుగుతారు కదా! వాళ్ళ పెద్దమ్మాయికి దేశంలో ఏ పేరూ లేనట్లు శైలజ అని పెట్టుకున్నారు. మరి మా అమ్మాయి పేరూ శైలజే! ఇంకా చాలా ఏళ్ళ తర్వాత మా ఇంటికి వచ్చిన కోడలి పేరూ శైలజే. కాబట్టి మేం వాళ్ళని పెద్ద శైలు, మన శైలు, చిన్న శైలు అని పిలిచేవాళ్ళం. పెద్ద శైలు బంగారుబొమ్మే! రూపంలోనే కాదు స్వభావంలోనూ, ప్రేమలోనూ, గుణంలోనూ కూడా. మా ఇద్దరికీ ఎన్నో మాట్లాడుకోవలసిన విషయాలుండేవి. తను లేడీ శ్రీరామ్ కాలేజిలో లిటరేచర్ ఆనర్సు చదువుతుండేది. నేను ఏ పని మీద ఢిల్లీ వెళ్ళినా, ఆ పనులయిపోయాక మాకిద్దరికీ ముఖ్యమైన కార్యక్రమం వుండేది. అదేవిటంటే షాపింగు చేయాలనే వంకతో లజపత్‌నగర్ మార్కెట్‌కి వెళ్ళి కడుపునిండా స్వీట్లు తినిరావడం. నేను పిల్లలకి ఏవో రెండు స్వెట్టర్లు, బట్టలు లాంటివి కొనేదాన్ని కానీ నా ధ్యాసంతా వంటింటి సరంజామా మీదే వుండేది. బోలెడు ప్లేట్లూ, కప్పులూ, కత్తులూ, కొత్తగా మార్కెట్టులో విడుదలయిన వంటింటి ఉపకరణాలూ కొనేదాన్ని. ఒకసారి 250 రూ. పెట్టి అక్కడ కొన్న చిన్న మిక్సరు కం గ్రైండరుని మేము పది సంవత్సరాలు పైగా వాడాము. ముఖ్యంగా అల్లం, పచ్చిమిరప, ఆవ, కొబ్బరి, గసగసాల పేస్టు లాంటివి నూరడంలో దానికదే సాటి. మళ్ళీ ఎంత ప్రయత్నించినా నాకెక్కడా అలాటిది దొరకలేదు. నేను నాజన్మలో ఏనాడూ వరసగా నాలుగురోజులు వంట చేయకపోయినా నాకు వంటిల్లంటే చాలా ఇష్టం. రకరకాల వంటలు నేర్చుకోవడం ఇష్టం. ఇప్పటికీ నేను అన్ని ఛానెల్స్‌లోనూ అన్ని కుకరీ షోలూ చూస్తూనే వుంటాను.

ఆ అన్నట్లు మా షాపింగయిపోయాక ఏం చేసేవాళ్ళమో చెప్పాలిగా. లజపత్‌నగర్ మార్కెట్లో మంచి మంచి మిఠాయి దుకాణాలు, చాట్ భండార్లూ వుంటాయి. మేం ఇద్దరం ఒక బెంచ్ మీద కూర్చుని ఒకటి తర్వాత ఒకటి ఆకు దొన్నెల్లో పెట్టి వాడిచ్చే జిలేబి, గులాబ్‌జామున్, రబిడీ, కచోరీ.. ఇలా వరసాగ్గా నిదానంగా తినేవాళ్ళం. కొన్ని పూర్తిగా తినలేమని అనిపించినపుడు ఒకటే ఆర్డరిచ్చి చెరి సగం తినేవాళ్ళం. మాలాంటి వాళ్ళుండబట్టే ఆ వ్యాపారస్థులు వర్ధిల్లుతున్నారు. తినగలిగినన్ని తిని, ఇంటి దగ్గర మాకోసం ఎదురు చూస్తున్న బిక్క ప్రాణులకు కొన్ని పాక్ చేయించుకుని పట్టుకెళ్ళేవాళ్ళం. ఆ రోజుల్లో సెల్‌ఫోనుల్లో వీడియోలు లేవు. ఒక్క వీడియో తీసి వుంచితే మిమ్మల్ని నమ్మించేందుకు నేనింత శ్రమపడవలసిన అవసరం వుండేది కాదు. నాకన్నా అంత చిన్నదయిన ఆ అమ్మాయికీ, నాకూ విడదీయలేని తీయని అనుబంధం వుండేదన్నమాట.

ఒకరోజు ఢిల్లీ నుంచి రావుగారు మాకు ఫోన్ చేసి పెద్ద శైలుకి పెళ్ళి కుదిరేలా వుందని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంకా నిండా ఇరవై ఏళ్ళు కూడా లేవు. అప్పుడే పెళ్ళా అని ఏవిటి శైలూ అనడిగితే గలగలా నవ్వింది. ఆ అబ్బాయి చాలా సంపన్నులు, విద్యాధికులు అయిన దంపతులకు ఏకైక సంతానం. బాగా చదువుకుని మంచి వుద్యోగంలో వున్నాడు. ఇంక ఎవరైనా ఎందుకు ఆలస్యం చేస్తారు? రావుగారు వాళ్ళ అన్నయ్యలతో కలిసి విజయనగరం వెళ్ళి సంబంధం కుదుర్చుకున్నారు. వాళ్ళు కట్నకానుకలు కోరలేదు. వెండి బంగారాలు కోరలేదు కాని వాళ్ళకి ఒక్కడే సంతానం అయినందువల్ల పెళ్ళి అయిదురోజులు కాకపోయినా నాలుగురోజులయినా జరపాలనీ అన్ని వేడుకలూ సంప్రదాయబద్ధంగా జరపాలనీ కోరారు. పెళ్ళి విశాఖపట్నంలో మే నెలలో జరిపేటట్లు ముహూర్తాలు పెట్టుకున్నారు. రావుగారికి విజయనగరంలో మంచి మావిడితోటలుండేవి. వేసవికాలం ముహూర్తం కాబట్టి తమ తోట మామిడిపళ్ళు పెళ్ళివారికి వడ్డించవచ్చని రావుగారు తెగ సంబరపడిపోయారు.

మమ్మల్ని ముందుగా రమ్మని కల్యాణి చాలా చెప్పిందిగానీ మేమూ, పిల్లలమూ ఒక్కరోజు ముందర చేరాం. మేము వాకిట్లోకి అడుగుపెడుతుండగానే పెద్ద శైలు పరిగెత్తుకుంటూ వచ్చింది, ఇంక నేను పెళ్ళికూతురైపోయానని అరుస్తూ! చేతుల్నిండా రంగురంగుల గాజులు, అరచేతిలో అసలైన గోరింటాకు, జడకుప్పెలూ, తలనిండా పూలూ, కళ్ళనిండా కాటుకా అచ్చమైన తెలుగింటి పెళ్ళికూతురు. ఇప్పటిలా బ్యూటీషియన్లూ, మేకప్‌లూ, ఉత్తరాది డ్రెస్సులూ, బాక్‌లెస్ బ్లౌజులూ.. మన

తెలుగునాట ప్రవేశించలేదు. అంత అలంకారమూ పసుపూ, పారాణీ, కాటుకా, పువ్వులూ ప్లస్ కొంతయినా ముగ్ధత్వంతోటే! ఆ చివరిది లేకపోతే పెళ్ళికూతురనిపించదు. తన ఆ అలంకారం రూపం ఇప్పటికీ నా కళ్ళకి కట్టినట్లుంటుంది. ఆలస్యంగా వచ్చినందుకు నిష్ఠూరాలు, పలకరింపులూ అయ్యాక మా సామాన్లు కల్యాణి వాళ్ళ నాన్నగారి గదిలో పెట్టుకోమన్నారు. ఆ ఇల్లు చాలా పూర్వోత్తరపుది. కనీసం వంద సంవత్సరాల చరిత్ర వుంది. అంత ఇంట్లో రెండు మూడు తరాల సభ్యులు కలిసి వుంటారు. ఒక ఏభైమంది హాయిగా వుండవచ్చు. కల్యాణికి పుట్టింటి బలగం ఎక్కువ. ఆరుగురు అక్కచెల్లెళ్ళూ, ఇద్దరన్నదమ్ములూ, బాబాయిలూ, పిన్నిలూ, వాళ్ళ పిల్లలూ అంతా ఒక పెద్ద దివాణం. అసలెవరయినా అమ్మాయి పెళ్ళి చేయాలంటే పిల్ల తల్లికి అమ్మా నాన్నా బాగున్నపుడు చేయాలి. ఆ వైభవమే వేరు. పెళ్ళికూతురికెంత గారాం జరుగుతుందో వాళ్ళ అమ్మకీ అంత గారాం జరుగుతుంది. కల్యాణి పని వాళ్ళ నాన్నగారి గదిలో పేర్చిన పరుపులమీద కూచుని కబుర్లు చెప్తూ వుండడమే.

ఆవేళ సాయంత్రం అవగానే చిన్నా చితకా షాపింగులున్నాయని చెప్పి అందరూ తలో దిక్కూ వెళ్ళారు. నేను, పెళ్ళికూతురు కలిసి గాడిపొయ్యిల పక్కన కూచుని వంటల వాళ్ళు చేస్తున్న సారెస్వీట్లు లడ్డూ, అరిసె, మైసూరుపాక్ లాంటివి రుచి చూసి పాస్ చేశాము. ఆ విధంగా మా స్వీట్ రిలేషన్ పూర్తిగా ఎస్టాబ్లిష్ అయింది. రాత్రి భోజనాలయ్యాక ఆడవాళ్ళకీ పిల్లలకీ వాళ్ళ నాన్నగారి గదిలోనే తుడిచి పక్కలేసారు. కళ్ళుమూసుకుని పడుకున్నాం కానీ ఒకటే మావిడి పళ్ళ వాసన. అస్సలు భరించలేక లేచి కూచున్నాను. వాళ్ళ నాన్నగారు కూడా లేచి కూచుని అమృతాంజనం వాసన చూసుకుంటున్నారు. "ఏవిటి బాబాయ్ గారూ! ఇంతగా పళ్ళవాసనొస్తోందీ?" అనడిగాను. "ఏం చెప్పమంటావమ్మా! మా అల్లుడు పెళ్ళివారికోసమని తనతోటనుంచి వెయ్యికాయలు తెప్పించి ఇదుగో నా మంచం కింద కాపు వేయించాడు. నాకు వారం రోజులనుంచీ ఇదే అవస్థ. తీసేయమందావంటే అతగాడేమనుకుంటాడో" అన్నారు. అప్పుడు చూసాను ఆయన పందిరిపట్టె మంచం కిందకి! గడ్డిలో దాక్కుని వున్న పళ్ళు పలకరించాయి. సరే ఇంక నిద్దర ఎటూ పట్టదు. కబుర్లు చెప్పుకోడానికి ఎవరైనా దొరుకుతారేమోనని హాలులోకి వెళ్ళా.

తెల్లవారితే పెళ్ళి హడావిడి మొదలవుతుందని తెలిశాక వాలంటీర్లకి నిద్ర ఎలా పడుతుంది? అప్పటికే హాలులో అయిదారుగురు చేతిలో డయిరీలు, పక్కన టీ గ్లాసులతో కనబడ్డారు. పెళ్ళికుమార్తె మేనమామ కోరిక మేరకు పెళ్ళి విశాఖపట్నంలో

అందమైన సముద్రతీరానగల ఫలానా బెస్తవాడలో గల మంచి గెస్టుహౌస్‌లో జరుగుతుందని తెలుసు. ఆ విషయం ఆహ్వానపత్రికలోనే వేశారు. కాబట్టి పెళ్ళిస్థలానికి పొద్దున్నే అందరూ గబగబా టిఫిన్లు తిని వెళ్ళిపోవాలని నిర్ణయం అయింది. మళ్ళీ ఎవరికే డ్యూటీలో చెక్ చేసుకోసాగారు. నేను చిన్నప్పట్నించీ ఏ పెళ్ళికెళ్ళినా పెళ్ళికూతురికి పూలజడ వేసేదాన్ని. నాకెవరు నేర్పారో గుర్తులేదు. బహుశా సావిత్రి వదినే నేర్పి వుంటుంది. మొదటిరోజున చీపురుపుల్లలకి పూలు గుచ్చి రెండు అటు రెండు ఇటు కట్టి మధ్యలో పరుపు లాగా నింపే జడ, సాయంత్రం అల్లుతూనే మధ్యలో పూలునింపే వంకీల జడ, మూడవరోజు మధ్యమధ్యలో రంగురంగుల ముచ్చిరేకులు పెట్టి వాటిమీద మల్లెపూల చక్రాలు అమర్చే జడ ఇలా రకరకాల జడలు వేయడం నాకు వచ్చు. ఆ బాధ్యత నేను అడిగి తీసుకున్నాను. ఒక్క హస్తకళ కూడా రాని నాకు ఈ పని ఎలా అబ్బిందో తల్చుకుంటేనే ఆశ్చర్యంగా వుంటుంది. అలా కబుర్లు చెప్పుకుంటూ అందరం అక్కడే నిద్దర్లుపోయాం. తెల్లవారుతూనే అందరం లేచి ఎవరి సామాన్లు వాళ్ళు సర్దుకుని, ఉప్మా టిఫిన్లు తినేసి పెళ్ళి జరిగే చోటికి బస్సులో చేరుకున్నాం. మేం అక్కడికి చేరుకునేటప్పటికి వంటలవాళ్ళు ఆడపెళ్ళివారికని సింపుల్‌గా పగటి వంట పూర్తి చేసి, మధ్యాహ్నం సమోసా టిఫినుకి తయారు చేసి పక్కనపెట్టి, రాత్రి డిన్నరు వంట ప్రయత్నంలో వున్నారు.

ఆడపెళ్ళివారికి పెద్ద గెస్ట్‌హౌస్, దాని పక్కన మంచి పార్కు, ఎదురుగా నాలుగడుగులు వేస్తే ఇంకో చిన్న బిల్డింగు. దాన్ని విడిదిగా తయారుచేశాం. మధ్యలో పెద్ద పందిరి వేసి చాందినీలు కట్టి రకరకాల అలంకారాలతో కళ్ళు చెదిరేలా చేస్తున్నారు ఆ పనివాళ్ళు. ఇంక రాబోయే నాలుగురోజులూ మర్యాదలయినా, భోజనాలయినా అన్నీ పందిరికిందే. అన్నట్లు ఆ బెస్తవాడ పెద్దలు వచ్చి మేమున్న నాలుగు రోజులూ వాళ్ళ భోజనాలు మా దగ్గిరే అని తెలియబర్చి వెళ్ళారు. వాళ్ళ సామ్రాజ్యంలోకి వెళ్ళాక మనం వాళ్ళు చెప్పినట్లు వినాల్సిందే కదా!

సర్కార్‌జిల్లాల్లో ఎదురుసన్నాహం అనే వేడుకని, విశాఖపట్నం వాళ్ళు తోటలో దిగడం అంటారు. అది ఒకలాంటి పరిచయ కార్యక్రమం. చాలా సరదాగా చేసుకుంటారు. అందులో మా మిత్రులు మధ్వులు. కొంచెం కర్నాటక అలవాట్లు కలిసి వుంటాయి. వాళ్ళు ఈ వేడుకని బిసిలూట అంటారుట. ఆడపెళ్ళివారందరూ తెల్లటి చీరలు కట్టుకుని అన్నీ తెల్లటి పదార్థాలే వడించాలి. అంటే కాబేజికూర. మజ్జిగపులుసు, పేణీలు, కొబ్బరి పచ్చడి, తెల్లవడియాలు లాంటివన్నమాట. ఆ విందుకి సరిపడే రకరకాల పాటలు కూడా వున్నాయి. పాడేవాళ్ళని కూడా రిహార్సలు

చేయించి తయారుగా పెట్టాం. మధ్యాహ్నం భోజనాలవగానే ఒక వంద మామిడి పళ్ళు రసం తీసి నీళ్ళు పోయకుండా ఐసు వేసి పక్కన పెట్టాం. ఇంత మండు వేసంకాలంలో అంత చల్లటి రసం ఇచ్చామంటే మన మర్యాదలకి పెళ్ళివారు డంగైపోవడం ఖాయం అని మాలో మేమే మురిసిపోయాం. మళ్ళీ వాళ్ళొచ్చాక టిఫిన్లు పెట్టాలంటే ప్లేట్లెక్కడ, నాప్‌కిన్‌లెక్కడ అని తత్తరపడకూడదని రెండు వరసలు బెంచీలు, కుర్చీలు వేసి పేపర్‌క్లాతులు పరిచి ప్లేట్లు, చెంచాలు వగైరాలన్నీ హోటల్‌లోలాగా క్లాసుగా సద్దాం. మా పనితనం చూసి మాకే ముద్దొచ్చేసింది. పెళ్ళివారు విజయనగరం నుంచి సరిగ్గా 2.50 కి రెండు బస్సులు నాలుగు కార్లలో బయలుదేరారని వర్తమానం వచ్చింది. అసలు మహరాష్ట్రవారు ఏ శుభకార్యమయినా ముగ్గులు, హారతి పళ్ళెం అలంకరణ అన్నీ చాలా అందంగా చేస్తారు. నేను మరి పూణెలో పది ఏళ్ళు వున్నదాన్ని కదా! నా తెలివితేటలు ప్రదర్శించేందుకు ఇంకా మంచి అవకాశం ఎక్కడ దొరుకుతుంది? పెద్ద గుండ్రటి వెండికంచంలో కనకాంబరాలు, మల్లెపూలు, మరువం సాయంతో గుండ్రటి జాతీయ పతాకాన్ని చేశాం. మధ్యలో అందమైన వెండి నందా దీపం పెట్టి నూనె పోసి వత్తివేసి తయారుపెట్టాం. అలాగే ఇంకొక వెండిసెట్టులో పసుపు, కుంకం, గంధం, పన్నీరు పెట్టాం. విడిది బాధ్యత వున్నవాళ్ళు అన్నీ సరిగ్గా వున్నాయో లేదో అంటే వియ్యపురాలు రాగానే అప్పచెప్పాల్సిన వస్తువులు (దువ్వెనలు, తలనూనెలు, కుంకుడుకాయలు, సున్నిపిండి, పసుపు, సబ్బులు వగైరాలు) అన్నీ చెక్ చేసుకుని వచ్చాక అందరం పందిట్లో కూచుని సమోసాలు రుచి చూడ్డం మొదలుపెట్టాం. నాలుగున్నరయిపోతోంది. ఇంకా పెళ్ళివారు రాలేదేవిటబ్బా. వాళ్ళుగానీ ఎడ్లబళ్ళల్లో రావట్లేదు కదా అని కుళ్ళు జోకులేసుకున్నాం.

ఎదురుగా సముద్రం చిన్నిచిన్ని కెరటాలతో శాంతంగా నిండుగా వుంది. అందులో ఆవేళ పౌర్ణమి. అబ్బ ఎంతదృష్టమో పౌర్ణమి రాత్రి సముద్రం వడ్డున గడిపే అవకాశం వస్తోందని తెగ ఆనందపడిపోయారు నాలాటి వాళ్ళు. విశాఖపట్నం వాళ్ళకి సముద్రం విలువ తెలియకపోవచ్చు గానీ మాలాటి హైదరాబాదు వాళ్ళం పెద్ద చెరువునే సముద్రం అని పిల్చుకుని ముచ్చటపడతాం. ఇంక నిజం సముద్రం పక్కనుంటే మాకెంత ఆనందంగా వుంటుందీ? ఎక్కడ్నించో సన్నగా ఈలపాట వినిపించింది. ఇంతబాగా ఈలెవరు వేస్తున్నారా అని ఆశ్చర్యపోయాను. కాని విశాఖపట్నం వాళ్ళు గాభరా పడటం మొదలుపెట్టారు. పెళ్ళివారింకా రాకపోతేనేం మేం వస్తున్నాం కదా అన్నట్లు చిన్నచిన్న మబ్బులు గబగబా, సినిమా హీరోల మీటింగుకి జనాలు పరుగెత్తుకొచ్చినట్లు రాసాగాయి. ఒక్క అయిదు నిమిషాల్లో

ఆకాశం అంతా నల్లగా అయిపోయి పట్టపగలు చిమ్మచీకటి కమ్మేసింది. లలితంగా వినిపించిన ఈలపాట పెద్దధ్వనితో మనకి తెలియని రాగాలాలపించసాగింది. అందరం గబగబా లోపలికి పరుగెత్తాం. మేం రిసెప్షనుకి ఏర్పాటు చేసిన హాల్లోకి వంటవాళ్ళు వంటగిన్నెలు, చేసిన వంటలూ గబగబా చేర్చేశారు. ఒక్కసారి తలుపులన్నీ వూగిపోసాగాయి. ప్రకృతి తాండవం ఆడ్డం అంటే ఏమిటో చూశాను. అసలు దేనికీ వ్యవధి ఇవ్వలేదు. పందిరి గుంజలతో సహా ఎక్కడెక్కడికో ఎగిరిపోయింది. బల్లలూ, కుర్చీలు, టిఫిన్ ప్లేట్లు అన్నీ కొట్టుకుపోయాయి. జడివానలో అన్నీ నీళ్ళల్లో కాయితం పడవల్లాగా తేలసాగాయి. దీనికి తోడు కరెంటు పోయింది. ఆ చీకట్లో ఏది ఎక్కడుందో ఎవరు ఎవరో తెలిస్తేకదా. ఆ సముద్రంకేసి చూడాలంటేనే భయం వేసింది. వస్తా మింగేస్తా అని బెదిరిస్తున్నట్లనిపించింది. సరిగ్గా ఆ సమయంలో బస్సులాగాయి. ఒక్కళ్ళే దిగి నడిస్తే ఎగిరిపోవడం ఖాయం. మా అవస్థ చూసి మధ్యాహ్నం భోజనం చేసిన బెస్తవాళ్ళందరూ వచ్చారు. పెళ్ళివారందరినీ జాగ్రత్తగా చేతులు పట్టుకుని నడిపించుకొచ్చారు. అందరం ఆ ఇంట్లో కూచుంటే సరిపోం. నిలబడే వున్నాం సుమారు ఒక గంటసేపు. రావుగారు రెండు చేతులూ కట్టుకుని మెట్లకానుకుని నుంచున్నారు. నేను గాభరా తట్టుకోలేక "రావుగారూ! ఏవిటిదీ! ఇపుడెలాగా?" అనడిగాను. "చూద్దాం! గాలీవానా వస్తే మనవేం చేస్తాం. తగ్గేదాకా ఇదుగో అందరం ఇలాగ నిలబడుండడమే మరి" అనడంతో నాకు కాస్త ధైర్యం వచ్చింది.

ఎంత గాలివానయినా ఎంతసేపుంటుంది? మహా అయితే ఒక గంట. ఈ లోపలే ఎగిరేవన్నీ ఎగిరిపోతాయి. మునిగేవన్నీ మునిగిపోతాయి. మబ్బులన్నీ తమ డ్యూటీ చేసుకుని వెళ్ళేటప్పటికి సూర్యుడు కూడా వాళ్ళవెంబడే వెళ్ళిపోయాడు. కొంచెం అటూ ఇటూ మసిలే అవకాశం దొరకగానే మాలో వుత్సాహవంతురాలొకావిడ గ్లాసుల్లో పళ్లరసం పోసి పెళ్ళివారికియ్యబోయింది. చలికి వణికిపోతున్న వియ్యంకుడుగారు నోరు తెరిచి "రసం వద్దండీ బాబూ! చలికి ఆగలేకపోతున్నాం! పెద్దవాళ్ళున్నారు! కాస్త వీలుచూసుకుని వేడిగా టీ పెట్టించండి" అన్నారు. 'సరే అలాగేనండీ' అన్నావిడ మళ్ళీ పత్తాలేదు. నెమ్మదిగా పెళ్ళివారిని ఆ పందిట్లోకి ఈదిస్తూ విడిదికి చేర్చాం. మళ్ళీ బెస్తవాళ్ళే సాయం చేసి బస్సులో సామాన్లన్నీ విడిదికి చేర్చారు. వంట బ్రాహ్మలు మళ్ళీ పొయ్యి రాజేసి పెళ్ళివారు కోరిన టీ పెట్టిచ్చారు. కానీ ఇంక మిగతా కార్యక్రమం ఎలా నడుస్తుంది? నాలుగే పెట్రోమాక్స్ లైట్లు. రెండు వంటవాళ్ళకి, ఒకటి మాకు, ఇంకోటి పెళ్ళివారికి. వియ్యపురాలు పెళ్ళిమాటల్లో చెప్పింది ముందుగానే "ఏవిటంటే విశాఖపట్నంలో వేసంకాలం కరెంటు నమ్మకం తక్కువ. మంచి జెనరేటర్ తయారుగా

వుంచండి. మాలో చాలామంది పెద్దవాళ్ళున్నారు. ఇబ్బందిపడతార"ని. వియ్యపురాలు ప్రత్యేకించి చెప్పారని జనరేటరు పని ఒకళ్ళకి పదిమంది అప్పచెప్పుకున్నారు. అక్కడే పనిలో తేడా జరిగిపోయింది. జనరేటరు తెచ్చివుంచారు కూడా! కానీ అది డీజిలు కోరుతుందని వీళ్ళు మర్చిపోయారు. మెకానిక్ డీజిల్ తెచ్చి కాస్త లైట్లు అమర్చేటప్పటికి తొమ్మిదయింది. అయిన భీభత్సాన్ని చేతనయినంత శుభ్రం చేసుకుని భోజనాలు డాబా మీద చేద్దామని అందర్నీ అక్కడికి తీసుకువెళ్ళాం. డాబామాత్రం పరిశుభ్రంగా లక్షణంగా వుంది. చందమామగారు లైట్లెందుకు నేనుండగా అన్నట్లు పిండారబోశాడు. ఆ వెన్నెట్లోనే మధ్వుల ఆచారం ప్రకారం తెల్లచీరలు కట్టుకుని దేవతల్లాగా మసకవెలుతుర్లో అటూ ఇటూ తిరుగుతున్న ఆడపెళ్ళివారి సరదా తీరేలా 'బిసిలూట' విందు జరిగింది. అమ్మయ్య అనుకున్నాం. ఆ డాబామీంచి సముద్రం చూస్తే ఎంత నిర్మలంగా, అమాయకంగా కనిపించిందో. భోజనాలవగానే అందరూ ఎక్కడివాళ్ళక్కడ నిద్రలు  పోయారు.

పందిరి ఎలాగూ పనికిరాలేదు కాబట్టి డాబా మీదే పెళ్ళి అనుకున్నాం. అప్పటికప్పుడు స్టేజి వేసి పైన చిన్న షామియానా కట్టి పెళ్ళి మంటపం అలంకరించాం. అంతమంది మావలున్నారు కాబట్టి తాను ఎట్టిపరిస్థితులలోను నడవననీ మావలు చచ్చినట్లు బుట్టలో తీసుకెళ్ళాల్సిందేనని పెళ్ళి కూతురు పేచీ పెట్టింది. వాళ్ళ అమ్మమ్మగారొచ్చి అన్ని మెట్లెక్కడం కష్టం. అమ్మా! ప్రమాదం అని ఆవిడ చెప్పినా తను వినిపించుకుంటేనా! చివరకు ఆ మావలందరూ ధైర్యం తెచ్చుకుని బుట్టలో కూచోబెట్టి మెట్లన్నీ ఎక్కుతూ మంటపానికి చేర్చారు. సలక్షణంగా సుముహూర్తం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు అయ్యాయి. అందరూ ఇడ్లీ, పచ్చడి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అప్పట్లో అంటే ఓ ముప్పై ఏళ్ళక్రితం బ్రేక్‌ఫాస్ట్ అంటే ఏదో ఓ ఉప్మానో, దోసో, ఇడ్లీయో ఏదో ఒకటి తిని కాఫీ తాగేవారు. మళ్ళీ పన్నెండింటికి భోజనం చేయటం. ఇప్పుడు బ్రేక్‌ఫాస్ట్ అంటే ఇడ్లీ, వడ, ఉప్మా పెసరట్టు, మసాలాదోసె, ఒకటి రెండు స్వీట్లు అధమపక్షం వుంటాయి. ఇన్ని తిన్నవాడు మళ్ళీ అన్నం ఏం తింటాడు? పొద్దున్నే ఆకలితో వున్నవాడికి అన్నీ ముందు పెట్టి ఏదో ఒకటే తినండి అని చెప్పలేం కదా!

ఫలహారాలు చేసాక బ్రాహ్మడు అందర్నీ డాబా మీదకి చేర్చి స్థాలీపాకం, నాకబలి, సప్తపది లాంటివి చేయించి అఫీషియల్‌గా పెళ్ళి తంతు పూర్తిచేశాడు. సాయంత్రం బంతులాట, బిందెలో ఉంగరాలు తీయడంలాంటి వేడుకలు అయ్యాయి. ఇంక మూడోనాడు పొద్దున్నే వంట బ్రాహ్మడు యధావిధిగా వంట చేసిపెట్టి మాకోసం

ఒక మొగుడు పెళ్ళాం జంటని అట్టే పెట్టాడు. రావుగారి చేతులు పట్టుకుని 'అయ్యా! చాలామంది బంధువులు పొద్దున్నే వెళ్ళిపోయారు. పెళ్ళివారితో వచ్చిన బంధువులు కూడా వెళ్ళిపోయారు. గట్టిగా చూస్తే మీరంతా కలిసి ఏభైమందికన్నా లేరు. ఈ భార్యాభర్తలు తేలిగ్గా వందమందికి చేయగలరు. సద్దుకోండి సార్. నాకు మంచి వంట ఒకటి తగిలింది. మరీ అవసరం అయితే మావాడ్ని పంపండి. వచ్చేస్తాన'ని దండాలు పెట్టి వెళ్ళిపోయాడు. సదస్యం అని పెట్టి కొందరు బ్రాహ్మలచేత వేదం చదివించి వాళ్ళని సన్మానించారు మగపెళ్ళివారు. ఇంకో పెళ్ళి వుంది అర్జెంటని పురోహితుడూ, అలాగే మేళం వాళ్ళూ, వీడియోవాళ్ళూ అందరూ అప్పగింతల టైముకి వస్తామని ప్రామిస్ చేసి జారుకున్నారు. మర్నాడు మధ్యాహ్నం రెండుగంటలకి అందరూ వచ్చి అప్పగింతల కార్యక్రమం పూర్తి చేసారు. పెళ్ళి సావకాశంగా ఆనందంగా చేద్దామని వున్నా కాలగమనంలో పరిగెత్తడమే అలవాటయిపోయిన మనం ఏపనీ స్థిమితంగా చేయలేం. కాసేపు కూచుని కబుర్లు చెప్పుకోలేం. అరిటాకుల్లో భోజనాలు వడ్డిస్తుంటే వడ్డన పూర్తయేదాకా ఆగలేం. ఈలోగానే అప్పడాలూ బజ్జీలూ తినేయడం మొదలెడతాం. ఏవిటో ఆ ఖంగారు. పిల్లలకేమో ఆఫీసుల తొందర! పెద్దలకేమో ఇంటిదగ్గర ఎదురు చూస్తున్న మనవళ్ళ పిలుపులు. అందరూ ఎటో ఒకవేపు పరిగెత్తాల్సిందే! తప్పదు. ఇటు అప్పగింతలయి పెళ్ళివారి బస్సు బయలుదేరగానే మా కుటుంబం గోదావరి పట్టుకోవాలని పరుగులు పెట్టాం. మొత్తానికి అంగబలం వుండి, కొంత సహనం కలిగి వుంటే ఎన్ని గాలివానలొచ్చినా ఎలా దాటవచ్చో, పరీక్షలని ఎలా ఎదుర్కోవచ్చో నాకు అర్థమయింది. అనుకోని సంఘటనలు జరిగినపుడు ఖంగారుపడితే అభాసయిపోతుంది. ధైర్యంగా వుంటే పరిస్థితులే దారికొస్తాయి.

✤